ప్రజాశక్తి

శనివారం 11 మే 2024

I

అల్లూరి సీతారామరాజు

నేడు రంపచోడవరానికి స్పెషల్ బస్‌లు

ప్రజాశక్తి-పాడేరు: ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగుల సౌకర్యం కోసం పాడేరు నుంచి రంపచోడవరం వెళ్లేందుకు ఈనెల 11న శనివారం ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ వి.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు ఏజెన్సీ నుంచి రంపచోడవరంలో ఎన్నికలు విధులు నిర్వర్తించడానికి వెళ్లే ఉద్యోగులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మేరకు ఈనెల 11న శనివారం సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి 11 గంటల వరకు ప్రతి గంటకు ఒక బస్సు పాడేరు నుంచి బయలుదేరి రంపచోడవరం వెళుతుందని తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులు పాడేరు నుండి బయలుదేరి జి.మాడుగుల, చింతపల్లి, కేడీపేట, రాజవొమ్మంగి, అడ్డతీగల మీదుగా రంపచోడవరం వెళతాయని తెలిపారు. ఇతర వివరాలకు ఆర్టీసీ డిపో ట్రాఫిక్ సూపరింటెండెంట్ ఫోన్: 7382914003, సిస్టం ఇంచార్జ్ 7382916863 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

నేటితో ముగియనున్న ఎన్నికల ప్రచారం

ప్రలోభాలకు తెరతీసిన ప్రధాన పార్టీలు

ప్రజాశక్తి - పాడేరు : శనివారం సాయంత్రం 6 .గంటలతో ఎన్నికల ప్రచారం ముగియనుంది. ప్రలోభాలకు ప్రధాన పార్టీలు తెరతీయనున్నాయి. ఇక పోలింగ్‌కు కొద్ది రోజులే ఉండటంతో అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో శుక్రవారం ఎన్నికల ప్రచారాలతో సందడి నెలకొంది. తీన్మార్ బ్యాండ్, దింసా నృత్యాలతో ఉత్సాహంగా సాగిన ప్రచార కార్యక్రమాలతో పాడేరు పట్టణం కోలాహలం గా మారింది. పాడేరులో శుక్రవారం వారపు సంత కావడంతో పాడేరు అసెంబ్లీ బరిలో నిలిచిన అభ్యర్థులు పాడేరు సంతను ప్రచార వేదికగా చేసుకొని పెద్ద ఎత్తున ప్రచార ర్యాలీలు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, వైసిపి అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు తరపున ఆ పార్టీల శ్రేణులు పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించారు. జన బలం ప్రదర్శనతో ఈ ప్రచార ర్యాలీలు పోటా పోటీగా సాగాయి. పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహంగా తరలివచ్చారు. పలు మండలాల, గ్రామాల నుంచి భారీగా తరలివచ్చిన జనాలతో పాడేరు కిక్కిరిసిపోయింది. శనివారం సాయంత్రం తో ఎన్నికల ప్రచారానికి గడువు ముగియనుంది. అభ్యర్థులు పాడేరు, అరకు అసెంబ్లీ నియోజక వర్గాల్లో శనివారం జరిగే వారపు సంతలను వేదిక తీసుకొని చివరగా ప్రచారాలు కొనసాగించి అనంతరం ముగించనున్నారు. పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం బరిలో నిలిచిన 16 మంది అభ్యర్థులు అరకు అసెంబ్లీ నియోజవర్గం బరిలో నిలిచిన 17 మంది అభ్యర్థులు తమ తమ బలా బలాలను బేరీజు వేసుకొని తమకు సానుకూలంగా ఉండే ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహించారు. ఇండిపెండెంట్లుగా నిలిచిన కొంతమంది అభ్యర్థుల ప్రచార జాడ కొన్నిచోట్ల కాన రాలేదు.

ప్రచారంలో అప్పలనరస ముందంజ

అరకు లోక్‌సభ సిపిఎం అభ్యర్థి పి.అప్పలనర్స అల్లూరి జిల్లాలోని పాడేరు, అరకు రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రచారంలో ముందంజలో నిలిచారు. అరకు ఎంపీ స్థానం నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ ఎంపీ కొత్తపల్లి గీత, వైసీపీ అభ్యర్థి తనూజ రాణి కంటే ప్రచారంలో ఆయన పైచేయిగా నిలిచారు. ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నేతగా, సిపిఎం జిల్లా కార్యదర్శిగా అనేక ప్రజా పోరాటాల్లో చురుగ్గా పాల్గొని వివిధ వర్గాల ప్రజల్లో ఆయన గుర్తింపు పొందారు. గిరిజన రైతు, ఉద్యోగ, కార్మిక, విద్యార్థి, రైతు వర్గాల్లో అప్పలనర్స తెలియని వారు లేరు. ప్రత్యామ్నాయ విధానాలతో ఆయన ఆకట్టుకున్నారు.

తాగునీటికి గిరిజనుల అవస్థలు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని మావోయి స్టుల ప్రభావిత ప్రాంతమైన బూసిపుట్టు పంచాయతీ డెంగగూడ గ్రామస్తులు తాగునీటికి అవస్థలు పడుతున్నారు.గ్రామ సమీపంలోని పారుగెడ్డ నీరే గతిగా వీరికి మారింది. వర్షాకాలంలో నీరు కలుషితమైనా ఆ గెడ్డ నీరే ఆధారంగా మారింది. వాగు, వంకల్లోంచి అనేక వ్యర్థాలు గెడ్డలో చేరుతున్నాయి. ఆ నీరు తాగడంతో వ్యాధుల బారిన పడుతున్నామని గ్రామ మహిళలు కర్ర డలిమ, కిల్లో దిల్పో, కొర్ర మొత్తి, కిల్లో డుంబ్రిలు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు జల్ జీవన్ మిషన్ పథకం పేరుతో ఇంటింటికి కుళాయిలు వేస్తున్నామని గత ఐదేళ్లుగా ప్రచారం చేసుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి తాగునీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని బరడ పంచాయతీ హంసబంధ గ్రామంలో తాగునీరు లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారు. గ్రామానికి ఆనుకున్న కొండపైనున్న ఊట చలమల్లో తాగు నీరుని సేకరించి తీసుకొస్తున్నారు. మండుటెండలతో గ్రావిటీ నీరు అడుగంటిపోయి తాగడానికి గుక్కెడు నీరు లేక అల్లాడుతున్నామని ఆ గ్రామ మహిళలు సిపిఎం నేతలకు తెలిపారు. శుక్రవారం పర్యటనలో భాగంగా హంసబంధ గ్రామంలో సిపిఎం నేతలు పర్యటించి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నేత గాసిరం దొర మాట్లాడుతూ, కనీసం తాగునీటి సౌకర్యాన్ని వైసిపి ప్రభుత్వం అందించలేక పోతోందన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామంలో కుళాయిలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎంఎం శ్రీను, నర్సింగ్ పడాల్, హంసబంధ గ్రామ మహిళలు పాల్గొన్నారు.

నీటిని మోసుకొస్తున్న డెగగూడ గ్రామస్తులు

హంసబంధ గ్రామంలో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

డుంబ్రిగుడలో భారీ వర్షం

ప్రజాశక్తి -డుంబ్రిగుడ : మండలంలో శుక్రవారం మధ్యాహ్నం పిడుగు శబ్దాలతో భారీ వర్షం కురిసింది. దీంతో మండల కేంద్రంలోని పుర వీధుల్లో వర్షపు నీరు చేరి కాలువలు, రోడ్లన్నీ జలమయంగా మారాయి. వర్షపు నీరు వీధుల్లో ఉధృతంగా ప్రవహించడంతో నివాస గృహాల్లో నీళ్లు చేరడంతో మండల కేంద్రం వాసులు పలు ఇబ్బందులు పడ్డారు. అరకు వారపు సంతకు వచ్చిన గిరిజనులు వర్షం కారణంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీగా కుండపోత వర్షం కురవడంతో మండలంలోని వ్యవసాయ రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఎండల తీవ్రత కారణంగా ఉక్కపోతకు గురవుతున్న మండల వాసులకు ఈ వర్షం ఊరటనిచ్చింది.

కురుస్తున్న వర్షం

టోర్నమెంట్ ట్రోఫీతో విజేత జట్టు సీలేరు ఎ టీమ్ సభ్యులు

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-సీలేరు

జికె.వీధి మండలం సీలేరు మారెమ్మ అమ్మవారి 52వ వార్షిక మహోత్సవం సందర్భంగా యంగ్ ప్లేయర్స్ ఆధ్వర్యంలో గత నెల 26 నుంచి జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. శుక్రవారం నాటి ఫైనల్ మ్యాచ్లో సీలేరు ఎ టీమ్, బి టీమ్ జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సీలేరు ఎ టీమ్ జట్టు క్రీడాకారులు నిర్ణీత 10 ఓవర్లలో 111 పరుగులు చేయగా, సీలేరు బి టీమ్ జట్టు 66 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన సీలేరు ఎ టీమ్, ద్వితీయ స్థానంలో నిలిచిన టి టీమ్ జట్టులకు ఏపీ జెన్కో పంపు స్టోరేజీ ప్రాజెక్టు ఎస్ఈ చంద్రశేఖర రెడ్డి, స్థానిక జల విద్యుత్ కేంద్రం ఈఈ లక్ష్మీనారాయణ, సిఆర్పిఎఫ్ 42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్, ఇన్స్పెక్టర్ సుభాష్ స్థానిక ఎంపిటిసి పిల్లా సాంబమూర్తి, సీలేరు సర్పంచ్ దుర్గ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పోటీల్లో మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచిన శశి కుమార్‌కు, మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ బచ్చులూరుకు చెందిన క్రీడాకారుడు రవికి ట్రోఫీలు అందజేశారు. బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా జాన్, బెస్ట్ బౌలర్‌గా అప్పలరాజు ఎంపికయ్యారు. కార్యక్రమంలో యంగ్ ప్లేయర్స్ అసోసియేషన్ నాయకులు విష్ణుకుమార్, సుందర్, పలువురు క్రీడాకారులు, అభిమానులు పాల్గొన్నారు.

మావోయిస్టు యాక్షన్ టీం సభ్యుల ఆచూకీ తెలిపిన వారికి నగదు బహుమతి

- చింతపల్లి ఎఎస్‌పి ప్రతాప్ శివ కిశోర్

ప్రజాశక్తి -సీలేరు

ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో సంచరిస్తున్న మావోయిస్టు యాక్షన్ టీం సభ్యుల ఆచూకీ తెలిపిన వారికి నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు చింతపల్లి సబ్ డివిజనల్ అడిషనల్ ఎస్పి ప్రతాప్ శివ కిషోర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం వెలిశాల గ్రామానికి చెందిన మావోయిస్టు సెంట్రల్ కమిటీ మెంబర్ గాదర్ల రవి అలియాస్ ఉదయ్‌పై రూ.25 లక్షలు, శ్రీకాకుళం జిల్లా వజ్రపు కొత్తూరు మండలం బాతుపురం గ్రామానికి చెందిన సెంట్రల్ జాయింట్ యాక్షన్ కమిటీ మెంబర్ చెల్లూరి నారాయణరావు అలియాస్ సురేష్, ఇదే గ్రామానికి చెందిన మెట్టూరు జోగారావు అలియాస్ టెక్ శంకర్, విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం కరకవానిపాలెం గ్రామ నివాసి వెంకట రవి లక్ష్మి చైతన్య అలియాస్ అరుణ, అల్లూరి జిల్లా జీకే వీధి మండలం కొమ్ములవాడ గ్రామస్తుడు కాకూరు పండన్న అలియాస్ జగన్ తదితరులపై ఒక్కొక్కరిపై రూ.20 లక్షలు, మల్కనగిరి జిల్లా కలిమెలా బ్లాక్ వాగపొడి అని అలియాస్ రమేష్, తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లా వాసి విజయలక్ష్మి అలియాస్ భూమికపై రూ.5లక్షలు, అదే రాష్ట్రానికి చెందిన రాధా అలియాస్ నీలో, చతీష్‌ఘడ్ రాష్ట్రం సుక్మా జిల్లా అసిస్టెంట్ కమాండెంట్ కోస అలియాస్ సాగర్, అదే రాష్ట్రం బీజాపూర్ జిల్లాకు చెందిన మడివి రాజేష్ అలియాస్ హండా, సోడి మంగ అలియాస్ నరేష్, ఒరిస్సా రాష్ట్రం కోరాపుట్ జిల్లా నారాయణపట్నంకు చెందిన యువకుడు తదితరులు ఒక్కొక్కరిపై రూ.4 లక్షలు చొప్పున రివార్డులు ఉన్నాయని పేర్కొన్నారు. వీరంతా మావోయిస్టు యాక్షన్ కమిటీ మెంబర్లుగా చలామణి అవుతున్నారని, వీరి ఆచూకీ తెలిపిన వారికి వారిపై ప్రకటించిన రివార్డుల నగదు అందిస్తామని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

అక్షయ తృతీయ సందర్భంగా ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-రంపచోడవరం

అక్షయ తృతీయ మండలంలోని ఐ.పోలవరం గోవిందగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బందితో, భక్తులు, పాల్గొన్నారు.

రంగసాయి మీడియా తొలి సినీ వెబ్ పత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నేటి చలనచిత్ర పరిశ్రమ వార్తా విశేషాలను క్షణాల్లో అభిమానులకు అందించడానికి నూతనంగా రంగసాయి మీడియా ఏర్పాటైంది. బాదంగీర్ సాయి నేతృత్వంలో ప్రారంభమైన ఈ రంగసాయి మీడియా తొలి సినీ వెబ్ పత్రికను శుక్రవారం సాయంత్రం రైటర్స్ అకాడమీ అధినేత, లీడర్ దినపత్రిక సంపాదకులు వివి.రమణమూర్తి విడుదల చేశారు. విశాఖపట్నం రంగసాయి నాటక గ్రంథాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రంగసాయి మీడియా సంస్థ ముమ్ముందు మరింతగా రాణించాలని ఆకాంక్షించారు.

కట్టడాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అక్రమ కట్టడం నిలుపుదల

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో జిసిసి గోదాముకు ఎదురుగా, ఎంపీడీవో క్వార్టర్ ఆనుకొని, ఎంఈఓ కార్యాలయ సమీపంలోని స్థలంలో గిరిజనేతరుడైన దుప్పటి నూకరాజు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నాడు. ఈ విషయమై ఆదివాసి సంక్షేమ పరిషత్ సంఘ సభ్యులు అనిల్ స్థానిక తహసిల్దార్ రఫీ జాన్‌కు ఫోనులో ఫిర్యాదు చేశారు. ఈ మేంకు మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రవికుమార్, స్థానిక వీఆర్వో రమేష్ కుమార్, సర్వేయర్ దామోదరం, వీఆర్ఏ గాసన్న లు అక్రమ నిర్మాణ స్థలానికి వెళ్లారు. అక్రమ కట్టడాన్ని నిలుపుదల చేయాలని ఆదేశించారు. గతంలో చేసిన ఫిర్యాదు మేర నిలుపుదల చేసిన కట్టడాలను పునః ప్రారంభం చేయడం చట్ట విరుద్ధమని వారిని హెచ్చరించారు. గిరిజనేతరుడిపై ఎల్‌టిఆర్ కేసు నమోదు చేయాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ సంఘ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ కట్టడాలపై జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్‌లు తక్షణమే స్పందించి అక్రమాలకు పాల్పడిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

పరీక్షలు చేస్తున్న డిఎం అండ్ హెచ్‌ఓ

రాయపాలెంలో ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి-పాడేరు: మండలంలోని ఈదులపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రాయపాలెం గ్రామాన్ని శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి.జమాల్ బాషా సందర్శించారు. ఇంటింటికి వెళ్లి గ్రామస్తుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సి డాక్టర్లతో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని గిరిజనులకు బిపి, మధుమేహం, హెచ్‌బి, మలేరియా వంటి పరీక్షలు చేశారు. తాగునీటి పరీక్ష నిర్వహించారు.. గ్రామస్తులందరికీ ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అనుమానిత కేసులను పిహెచ్‌సికి అంబులెన్స్‌లో తరలించారు. కిడ్నీ పనితీరు కోసం రక్త పరీక్షల నిమిత్తం పాడేరుకు రిఫర్ చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు.

ఎన్నికల సామగ్రి అందజేతకు 23 కౌంటర్లు

నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ప్రశాంత్‌కుమార్

ఎన్నికల సిబ్బందితో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి ప్రశాంత్‌కుమార్

ప్రజాశక్తి-రంపచోడవరం

ఈ నెల13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి 399 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు, వివి ప్యాడ్లు, ఇతర ఎన్నికల సామాగ్రి పోలింగ్ అధికారులకు అందజేయడానికి స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని రిసెప్షన్ సెంటర్ వద్ద 23 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు రంపచోడవరం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రాంగణంలో రిసెప్షన్ సెంటర్ ఏర్పాట్లపై తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, సెక్టార్ అధికారులు, రూట్ అధికారులతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రశాంత్ కుమార్, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కావూరి చైతన్య శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సామాగ్రి అందజేత ప్రక్రియ ఈ నెల 12న ఉదయం ఏడు గంటల నుండి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రారంభమవుతుందని తెలిపారు. రంపచోడవరం నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించేందుకు పాడేరు, అరకు ప్రాంతాల నుండి ఎన్నికల అధికారులు, సిబ్బంది 11వ తేదీన వస్తారని, వారికి వసతి ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈవీఎంలు, వివి ప్లాట్లు పోలింగ్ కేంద్రాలకు తీసుకువెళ్లేటప్పుడు సూర్యరశ్మి తగలకుండా, ఇతరులు ఎవరు కూడా ఫొటోలు తీయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాల ఏర్పాట్లపై శనివారంలోగా నివేదికలు సమర్పించాలన్నారు. 399 పోలింగ్ కేంద్రాలలోనూ రెండు చొప్పున వెబ్ కాస్ట్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో పిడిఎంఎస్ యాప్ ఏర్పాటు చేస్తామని, ఈ యాప్‌లో 13న ఎన్నికల పోలింగ్ శాతాన్ని, ఎన్నికలు జరుగుతున్న తీరుని పొందుపరచాలని సూచించారు. నెట్‌వర్క్ లేని ప్రాంతాలలో రన్నర్లను ఏర్పాటు చేస్తామన్నారు. 399 పోలింగ్ కేంద్రాల్లో సమస్యలను తెలుసుకునేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు కృష్ణజ్యోతి, ఏవి.రమణ, చలపతిరావు, డివి సత్యనారాయణ, సత్య సులోచన, మురళీకృష్ణ, నాగమణి, నాగరాజు, డిప్యూటీ తహశీల్దార్లు బి.రాజు, శివ, శ్రీధర్, స్వామి, చైతన్య, వీరభద్రరావు, బాలాజీ, సరిత, రవీంద్రబాబు, సుధాకర్ బాబు, ఎ.సత్యనారాయణ, రూట్ అధికారులు, సెక్టార్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ సీనియర్ నాయకులు దుర్గాప్రసాద్ మృతి

ప్రజాశక్తి-కూనవరం : తొలితరం కమ్యూనిస్టు నాయకులు, సిపిఐ నేత కామ్రేడ్ మండ దుర్గాప్రసాద్ శుక్రవారం తెల్లవారుజామున మండపేటలో గుండెపోటుతో మృతి చెందారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ కాలం నుంచి ఆయన పార్టీ హోల్ టైమర్‌గా పని చేశారు. విశాలాంధ్ర విలేకరిగా, సిపిఐ మండల కార్యదర్శిగా, డివిజన్ కార్యదర్శిగా, జిల్లా కార్యవర్గ సభ్యులుగా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా బాధ్యతలు నిర్వహించిన ఆయన పార్టీకి ఎనలేని సేవలు అందించారు. సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరు వెంకటేశ్వరరావు, కొత్తగూడెం జిల్లా కౌన్సిల్ సభ్యులు రావులపల్లి రవికుమార్ తదితరులు దుర్గాప్రసాద్ భౌతిక కాయంపై ఎర్రజెండా కప్పి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుర్గాప్రసాద్ కూలి పోరాటాలు, భూ పోరాటాలు, అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. తనువు చాలించే వరకు ఎర్రజెండా కోసమే పరితపించిన నిస్వార్థ కమ్యూనిస్టు నాయకుడిని కోల్పోయామన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, బిఆర్ఎస్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, ఆకోజు సునీల్, సిపిఐ ఎటపాక డివిజన్ కార్యదర్శి గుజ్జ మోహన్ రావు, సహాయ కార్యదర్శి వాసం రాము, మండల కార్యదర్శి ఎలీశాల నాగరాజు, గన్నవరం ఎంపీటీసీ కంటే రాజు, కూనవరం సీనియర్ నాయకులు లంబు శ్రీనివాసరావు, జుత్తుక సూర్యచంద్రరావు తదితరులు దుర్గా ప్రసాద్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

దుర్గాప్రసాద్ మృతదేహాన్ని సందర్శించిన సిపిఎం నాయకులు, బంధువులు ఇన్‌సెట్‌లో దుర్గాప్రసాద్ (ఫైల్‌ఫొటో)

శతశాతం ఓటింగ్‌కు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -సీలేరు

ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో ఓటర్లు 100 శాతం ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని ఎన్నికల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను సెక్టార్ అధికారి మధుసూదనరావు ఆదేశించారు. జికె.వీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఒకటి నుంచి ఆరు వరకు పోలింగ్ బూతులను, దుప్పిలివాడ పంచాయతీ బూస్కొండ ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ బూత్‌ను శుక్రవారం సెక్టార్ అధికారి మధుసూదనరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ బూత్‌ల్లో విద్యుత్, తాగునీటి సౌకర్యం తదితర ఏర్పాట్లు ముందస్తుగానే చేయాలని సూచించారు. ముందస్తుగానే ఆదివారం సాయంత్రం ఎన్నికల సిబ్బంది సీలేరు చేరుకుంటారని, వారికి వసతి, భోజన సౌకర్యాలు ఏర్పాట్లు చేసి ఎటువంటి సమస్యలు తలెత్తకుంటూ చూడాలని ఆదేశించారు. పోలింగ్ బూతుల్లో బల్లలు, కుర్చీలు పూర్తిస్థాయిలో సమకూర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్‌ఓలు, సీలేరు సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుసుమ, మహిళా పోలీస్ రేవతి, యానిమల్ అసిస్టెంట్ అనుష్క, స్వరూప, ఉమా మహేష్, జయరాము, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం వద్ద సెక్టార్ అధికారి మధుసూదనరావు, సచివాలయ సిబ్బంది

సిపిఎం అభ్యర్థులకు అపూర్వ ఆదరణ

లోతా రామారావుకు స్వాగతం పలుకుతున్న మహిళలు

ప్రజాశక్తి- యంత్రాంగం

విఆర్.పురం : ఇండియా వేదిక బలపర్చిన సిపిఎం రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావుకు ప్రజల నుండి అపూర్వ ఆదరణ లభిస్తోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం లోతా రామారావు మండలంలోని మొద్దులగూడెం, సీతంపేట, శ్రీరామగిరి, చొక్కనపల్లి, కల్తూనూరు, జీడిగుప్ప కొండదారి, జీడిగుప్ప కాలనీ తదితర గ్రామాలలో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు రామారావుకు పూలమాలలు, హారతులతో ఘన స్వాగతం పలికారు. పోలవరం పునరావాసం, ప్యాకేజీ సొమ్ములు రాలేదని తమ గోడును లోతా రామారావు ఎదుల వెల్లబుచ్చారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఈ నియోజకవర్గం నుండి గెలిచిన ఎమ్మెల్యేలు నిర్వాసితుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యేగా తనను, అరకు ఎంపీగా పాచిపెంట అప్పలనర్సను గెలిపిస్తే పోలవరం నిర్వాసితుల సమస్యలపై చట్టసభల్లో పోరాడి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. అందరూ సుత్తి కొడవలి నక్షత్రం గుర్తికే ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి కారం లక్ష్మి, సర్పంచ్ పులి సంతోష్ కుమార్, సిపిఎం నాయకులు పూనం సత్యనారాయణ, సోయం చిన్నబాబు, పంకు సత్తిబాబు, కుంజ నాగిరెడ్డి, వడ్లాది రమేష్, కారం సుందరయ్య, తోడం రాజు, పోడియం రాము, సోడి మల్లయ్య, పులి ధర్మరాజు, ఖాదర్, కొండారెడ్డి, కమ్మచిచ్చు సత్యనారయణ, తాతబాబు రెడ్డి, గుండెపూడి లక్ష్మణరావు, సుధీర్ చంద్రరావు పాల్గొన్నారు.

ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించాలని బైక్ ర్యాలీ

సీలేరు : ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం అరకు పార్లమెంట్ అభ్యర్థి పాసిపెంట అప్పల నర్స, పాడేరు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి బుల్లిబాబును సుత్తి కొడవలి నక్షత్రం గుర్తు, హస్తం గుర్తులపై ఓట్లు వేసి గెలిపించాలని కోరుతూ జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ వలసగెడ్డ, బూసుకొండ, శాండు కోరి గ్రామాలు, సీలేరు పంచాయతీ పరిధిలోని వీధుల్లో శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎర్రజెండాలు, కాంగ్రెస్ జెండాలు రేపరెపలాడిస్తూ పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కారె శ్రీనివాస్, మల్లు దొర, సొల్లు, సిపిఐ నాయకులు సుంకర విష్ణుమూర్తి, సిపిఎం నాయకులు బాగూరు కోటేశ్వరరావు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

జికె.వీధి మండలంలో బైక్ ర్యాలీ

సిపిఎం, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

డుంబ్రిగుడ: ఇండియా ఫోరం బలపరిచిన అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పి.అప్పలనర్స, కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థి ఎస్.గంగాధర స్వామిలకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మండలంలో శుక్రవారం అరకు వారపు సంతలో ముమ్మరంగా ప్రచార చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి గంగాధర్ స్వామి తో పాటు ఇండియా పోరం నాయకులు, కార్యకర్తలు దుర్గా దేవి గుడి ఆలయం నుంచి గవర్నమెంట్ హైస్కూల్ మీదుగా వారపు సంతకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కే.సురేంద్ర మాట్లాడుతూ, భావితరాల భవిష్యత్తుకు ఇండియా ఫోరం ఏర్పడిందని ఆ కూటమి బలపరిచిన ఎంపీ, ఎమ్మెల్యేల అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆదివాసీల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న సిపిఎం ఎంపీ అభ్యర్థిని పార్లమెంట్‌కు పంపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్ బి పోతురాజు, అరకులోయ మండల కార్యదర్శి పి.బాలదేవ్, సీనియర్ నాయకులు ఆర్.రాము, గసభ పంచాయతీ సర్పంచ్ పి.సునీత, మాజీ సర్పంచ్ పి సురేష్‌కుమార్, టి.సూర్యనారాయణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

పెదబయలు: ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు పాచిపెంట శాంతికుమారి శుక్రవారం పెదబయలులో కరపత్రాలు పంపిణీ చేసారు. అనంతరం చిట్రాయ్ పుట్టు, అడుగుల పుట్టు, వడ్డెపుట్టు, బంగారుమెట్ట, కుజబంగి, పెద్దాపుట్టు, పర్రెడ తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

అనంతగిరి: సిపిఎం పార్లమెంట్ అభ్యర్థి అప్పలనర్స, కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థి గంగాధర్ స్వామిలను గెలిపించాలని ఇండియా ఫోరం నేతలు ప్రచారం చేశారు. జెడ్పిటిసి దీసరి గంగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె గోవిందరావు, మండల కార్యధర్శి ఎస్.నాగులు మాట్లాడుతూ, ఎన్డీఏ కూటమి, వైసిపి అభ్యర్థులకు ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వేంగడ సీపీఎం సర్పంచ్ సివెరి కొండలరావు, కార్యకర్తలు వి.బుద్రయ్య పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో ప్రచారం చేస్తున్న సిపిఎం, కాంగ్రెస్ కార్యకర్తలు

కాలువలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ముంచంగిపుట్టు: మల్కాపురం ప్రధాన కాలువలో పడి ఒకరు మృతిచెందారు. స్థానికుల కథనం ప్రకారం... మల్కాపురం గొల్లవీధిలో కర్రి రాజు భార్య పిల్లలతో కలిసి నివాసముంటున్నాడు. శుక్రవారం రాత్రి కర్రి రాజు బహిర్భూమికి వెళ్లాడు. కాలువ పక్కన వెళ్లడంతో ఒక్కసారిగా కాలుజారి పడిపోయాడు. అయితే వెళ్లిన స్థానికులు గమనించి బయటకు తీశారు. అప్పటికే మృతిచెందడంతో ఆయన కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు. భార్య, పిల్లలు సంఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -కొయ్యూరు: ఈ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి బూత్ లెవెల్ అధికారులు ఎన్నికల విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లు సూచించారు. మండల సమావేశంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజకీయాలకు అతీతంగా విధులు నిర్వహించాలని, అంకితభావంతో పని చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బందికి రాజకీయ పార్టీల నుంచి ఎటువంటి ఆహార పదార్థాలు, తాగునీరు వంటివి ఏర్పాటు చేయకుండా చూడాలన్నారు. రాజకీయ నాయకులు పోలింగ్ కేంద్రాలకు సమీపంలో ఉండకుండా చూడాలన్నారు. వృద్ధులు, వికలాంగులు ఓటర్లకు ఇబ్బంది కలగకుండా రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. ఓటర్ స్లిప్పుల సమస్యలు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనారాయణ, ఆర్ఐ ఉగ్గరరావు పాల్గొన్నారు.

పాము కాటుతో ఉపాధి కూలికి అస్వస్థత

ప్రజాశక్తి -గొలుగొండ: మండలం పాకలపాడు గ్రామానికి చెందిన రొంగల రాజుబాబు అనే ఉపాధి కూలీ శుక్రవారం ఉదయం పాముకాటుకు గురయ్యాడు. ఉదయం ఉపాధి పనులకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఉపాధి కూలీని ఉపాధి హామీ పథకం ఈసీ రాధిక, టెక్నికల్ అసిస్టెంట్ ఆసుపత్రిలో పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించేందుకు ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పారు.

అల్లూరి స్మారక మందిరాలపై నిర్లక్ష్యం

ప్రజాశక్తి -గొలుగొండ: అల్లూరి సీతారామరాజు స్మారక మందిరాల నిర్మాణంలో ప్రభుత్వం ఐదేళ్ల పరిపాలనలో నిర్లక్ష్యం వహించిందని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు ఆరోపించారు. శుక్రవారం ఆయన స్థానిక అల్లూరి సీతారామరాజు స్మారక పార్కును సందర్శించిన సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.వైసిపి పరిపాలనలో పార్కు అభివృద్ధికి కోటి 16 లక్షలు ప్రకటించి ఒక్క రూపాయి కూడా విడుదల చేసి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. పార్కులోని భవనాలన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. పార్కును సందర్శించే పర్యాటకులకు గుక్కెడు మంచినీళ్లు కూడా లేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కార్యదర్శులు శ్యామల వరలక్ష్మి, శివంగి నాగేశ్వరరావు, అంబటి వరహాలరాజు, విశాఖ జిల్లా గంటం దొర మల్లు దొర సేవా సంఘం ప్రధాన కార్యదర్శి వారం రామచంద్రబాబు నాయుడు, కార్యదర్శి కంబాల శంకర్రావు పాల్గొన్నారు.

కవితా సంకలనం బహూకరణ

ప్రజాశక్తి -గొలుగొండ: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ప్రచురించిన ఎన్నికల కవితా సంకలనం గ్రంథాన్ని అల్లూరి సీతారామరాజు మైత్రి గ్రంథాలయానికి ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడాల వీరభద్రరావు గ్రంథాలయ కమిటీ వారికి బహూకరించారు. శుక్రవారం అల్లూరి సీతారామరాజు స్మారక పార్కును సందర్శించిన ఆయన అనంతరం అల్లూరి సీతారామరాజు మైత్రి గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కార్యదర్శులు శ్యామల వరలక్ష్మి, శివంగి నాగేశ్వరరావు, అంబటి వరహాలరాజు పాల్గొన్నారు.

సమ్మర్ కోచింగ్ క్యాంపు ప్రారంభం

ప్రజాశక్తి -అనకాపల్లిడెస్క్: నర్సీపట్నం ఆర్ప్ మార్షల్లో ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కరాటే సమ్మర్ కోచింగ్ క్యాంపు ప్రారంభించారు. సుమారు 50 మందికి పైగా హాజరైన పిల్లలందరికి పౌష్టికాహారం(గుడ్లు, బ్రెడ్లు వగైరా) ఉచితంగా అందజేశారు. వేసవి సెలవుల్లో ఈ శిక్షణతో సమయం వృథా కాదని, పిల్లల్లో స్వయం సంరక్షణకు, శరీర ఆరోగ్యానికి ఎంతో ఉపయోగ పడుతుందని అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.శ్రీరామ్మూర్తి, మధు, మెయిన్ కోచ్ రామోజు ప్రసాద్(చిన్ని), కోచ్ శివ, డైరెక్టర్ కిశోర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కంపెనీలు తీసుకొస్తామంటూ...

సిఎం రమేష్ మాయమాటలు

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెంకటేష్

ప్రజాశక్తి -కోటవురట్ల

మూతపడ్డ చక్కెర కర్మాగారాల్లో ఈథనాల్ కంపెనీలు తీసుకొస్తామంటూ బిజెపి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ మాయ మాటలు చెపుతున్నారని అనకాపల్లి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వేగి వెంకటేష్ ఆరోపించారు. మండలంలో శుక్రవారం ఆయన పలు గ్రామాల్లో సందర్శించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఈథనాల్ కంపెనీ తీసుకువచ్చి ఫ్యాక్టరీ ఆస్తులను స్వాధీనం చేసుకోవడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నారన్నారు. ఈథనాల్ కంపెనీలు తీసుకురావడంతో భూగర్భ జలాలు అడుగంటవమే కాకుండా, తాగు, సాగునీటికి ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. దేశాన్ని సర్వనాశనం చేసేందుకే బిజెపి కంకణం కట్టు కుందన్నారు. ఐదు సంవత్సరాలు పరిపాలించిన వైసిపి ఏమి ఉద్ధరించిందని ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా రహదారులన్నీ ధ్వంసం అయ్యాయని, పట్టించుకునే నాథుడే లేడన్నారు. కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసు కొచ్చేందుకు పిసిసి చీఫ్ షర్మిల సర్వసక్తులు ఒడ్డుతున్నారని, ఆమె నాయకత్వంలో భవిష్యత్తులో రాష్ట్రానికి మంచి రోజులు రానున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కేవీపీ రాజు, మాజీ ఎంపీటీసీ సభ్యులు నడుంపల్లి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

టిడిపితో మహిళలకు ప్రత్యేక గుర్తింపు

ప్రజాశక్తి-నక్కపల్లి: మహిళలకు ప్రత్యేక గుర్తింపునిచ్చింది తెలుగుదేశం పార్టీ అని పాయకరావుపేట నియోజక వర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత అన్నారు. నక్కపల్లిలో క్రిష్ టౌన్ షిప్‌లోని శుక్రవారం ఆమె స్వగృహంలో పాయకరావుపేట నియోజకవర్గం మహిళలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అనిత మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ,మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజాస్వామ్యంలో మహిళలకు ప్రత్యేక స్థానం కల్పించారన్నారు. మహిళలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలనే సంకల్పంతో డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసి తోడ్పాటును అందించడం జరిగిందన్నారు. జగన్ పాలనలో వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేశారన్నారు. నవరత్నాల పేరిట ప్రజలను మోసం చేశారని, నిత్యావసర సరుకులు అడ్డు అదుపు లేకుండా పెరిగాయన్నారు. ఓటుతో జగన్ ప్రభుత్వానికి చరమగీతం పాడాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సీఎం రమేష్ కోడలు పూజ, పాయకరావుపేట నియోజకవర్గం కూటమి మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నక్కపల్లి: పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి అనిత అన్నారు. మండలంలోని అమలాపురంకు చెందిన పలువురు టిడిపిలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తానని అనిత హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా ఎన్నికల విధులు నిర్వహించాలి : ఆర్ఓ గీతాంజలి

ప్రజాశక్తి- నక్కపల్లి: బూత్ లెవెల్ అధికారులు బాధ్యతగా ఎన్నికల విధులు నిర్వహించాలని పాయకరావుపేట నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి గీతాంజలి సూచించారు. స్థానిక ఆర్ఓ కార్యాలయంలో శుక్రవారం బూత్ లెవెల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ బూత్‌ల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. వృద్ధులు, వికలాంగులు త్వరితగతిన ఓట్లు వేసే విధంగా పోలింగ్ స్టేషన్ వద్ద ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ వద్ద వీల్ చైర్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఓటేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించండి

ప్రజాశక్తి -అనకాపల్లి : ప్రతి ఓటరూ తమ ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం పిలుపునిచ్చారు. ఈ మేరకు 'ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం- ఓటు హక్కును ఉపయోగించుకుందాం, మన ఓటు-మన హక్కు నినాదాలతో అసోసియేషన్ ముద్రించిన కరపత్రాలను శుక్రవారం పట్టణంలోని మెయిన్ రోడ్, చేపల బజార్, కస్పావీధి, కుంచా వారి వీధి, రామాలయం జంక్షన్, పిళ్లా వారి వీధి తదితర ప్రాంతాల్లో పంపిణీ చేసి విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వినకోట నీలేశ్ గుప్తా, సభ్యులు పెదిరెడ్ల సుజాత, ఓటర్లు పాల్గొన్నారు.

పేదలకు గొడుగులు, చెప్పుల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక వాసవి క్లబ్, జానకి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం పేదలకు గొడుగులు, ఆహార ప్యాకెట్లు, చెప్పులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ జోనల్ చైర్మన్ పిప్పళ్ళ సత్య మాట్లాడుతూ ఎండాకాలంలో పేదలకు చెప్పులు, గొడుగులు ఎంతో అవసరమని, అందుకే వాటిని పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో సిద్ధి లింగేశ్వర దేవస్థానం చైర్మన్ నుదురుపాటి తాతాజీ, జంగాల శ్రీనివాస్ శ్రీధరాల హరికృష్ణ, రాజేష్, శ్రీనివాస హెూటల్ అధినేత శ్రీనివాస్ పాల్గొన్నారు.

దళితులపై వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యం

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రంలో దళితుల పట్ల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చిన్న చూపు చూసిందని జిల్లా మాల మహానాడు అధ్యక్షులు రేబాక రామారావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దళితవాడలను పంచాయతీలు చేసినా వాటికి నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. 2024 వైసీపీ మేనిఫెస్టోలో దళితులకు ఒరిగిందేమీ లేదన్నారు. దశాబ్దాల తరబడి దళితుల స్వాధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను వైసిపి ప్రభుత్వం అభివృద్ధి పేరుతో లాక్కుందని పేర్కొన్నారు.

రెజ్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా మాణిక్యాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : రెజ్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ ఒలింపియన్ ఎంవి మాణిక్యాలను ఎన్నుకున్నారు. చిత్తూరులో జరిగిన రెజ్లింగ్ అసోసియేషన్ ఎన్నికల్లో ఆయనను ఎన్నుకోవడం పట్ల పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు అభినందించారు. రెజ్లింగ్ క్రీడ అభివృద్ధికి తన శక్తివంచన లేకుండా కషి చేస్తానని మాణిక్యాలు తెలిపారు.

బైక్‌ను వ్యాన్ ఢీకొని ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి - వడ్డాది : బుచ్చియ్యపేట మండలం విజయరామరాజుపేట గాయత్రి కళాశాల సమీపంలోని బియన్ రోడ్లో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. పోలీసులు కథనం ప్రకారం... వీరవిల్లి గ్రామానికి చెందిన విస్సారపు గణేష్, శీలం మధు వడ్డాది నుండి ద్విచక్ర వాహనంపై శుక్రవారం సాయంత్రం చోడవరం వెళుతున్నారు. విజయరామరాజుపేట గాయత్రి కళాశాల సమీపంలోకి వచ్చే సరికి ఎదురుగా వస్తున్న టాటా ఐషర్ వ్యాన్ వారిని బలంగా ఢీకొట్టింది. దీంతో విస్సారపు గణేష్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. తీవ్రంగా గాయపడ్డ మధును 108 వాహనంలో చోడవరం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సమాచారం తెలిసిన వెంటనే బుచ్చయ్య పేట ఎస్ఐ ఈశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి, మృతదేహాలను చోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పెద్ద సంఖ్యలో బంధువులు మృతదేహం వద్ద రోధించారు. మృతుడు గణేష్‌కు భార్య శ్యామల, ఒక బాబు ఉన్నారు. ఆయన వడ్డాదిలో ఒక ధాబాను నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. రెండో మృతుడు మధుకి భార్య ప్రసన్న, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన బైక్ మెకానిక్‌గా జీవనోపాధి పొందుతున్నారు

ప్రజలను దోచుకున్న జగన్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 360 సార్లు బటన్ నొక్కి లబ్ధిదారులకు డబ్బు పంపిణీ చేశానని చెబుతున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రూపాయి ఇచ్చి వంద రూపాయలు ప్రజల నుంచి లాక్కున్నారని, దీనిని రాష్ట్ర ప్రజలంతా గ్రహించారని మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ ఆరోపించారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

చందనోత్సవం.. విజయవంతం

» భక్తులకు పటిష్ట ఏర్పాట్లు చేసిన అధికారులు
» ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో తగ్గిన 'పొలిటికల్' రద్దీ

సింహాద్రి అప్పన్నకు పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న అశోక్ గజపతిరాజు

ప్రజాశక్తి - సింహాచలం : సింహాద్రి అప్పన్న ఆలయంలో జరిగే అతిపెద్ద ఉత్సవమైన చందనోత్సవం విజయవంతమైంది. దేవస్థానం అధికారులు ఉత్సవాన్ని రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పూర్తి చేశారు. శుక్రవారం ఉదయం సుప్రభాత సేవతో అప్పన్న స్వామిని మేల్కొలిపారు. సేవా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం స్వామిపై ఉన్న చందనాన్ని తొలిచి ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామి వారి తొలి దర్శనాన్ని ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతి రాజు దంపతులకు కల్పించారు. ఈ ఏడాది చందనోత్సవంలో సామాన్య భక్తులకు అధికారులు పెద్దపీట వేశారు.

శుక్రవారం వాతావరణం చల్లబడడంతో భక్తులు భారీగానే తరలివచ్చారు. ఆహ్లాదకర వాతావరణం నడుమ నృసింహస్వామిని దర్శించుకున్నారు. సుదీర్ఘ క్యూలైన్లు ఉండటంతో కొందరు భక్తులు ఇబ్బంది పడటం కనిపించింది. భక్తులకు క్యూ లైన్లలో మంచినీటి సదుపాయం కల్పించారు. మజ్జిగ, శీతల పానీయాలను స్వచ్ఛంద సేవా సంస్థల వారు అందించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు టికెట్ లేకుండా ఏ ఒక్కరినీ దర్శనానికి అనుమతించకపోవడంతో ప్రతి భక్తునికీ సామి దర్శనం సాఫీగా సాగింది. సాయంత్రం భక్తుల రద్దీ దృష్ట్యా రూ.300, రూ.1000, రూ.1500 క్యూలైన్లలో భక్తులను పంపించి రద్దీని నియంత్రించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా గట్టి పోలీస్ భద్రత కల్పించారు. వాహనాలను కొండపైకి అనుమతించలేదు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో రాజకీయ నాయకులకు, అధికారులకు ప్రొటోకాల్ వర్తించలేదు. స్వామివారిని శారదా పీఠాధిపతి స్వరూపానంద సరస్వతి, ఆయన శిష్యులు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, దేవాదాయ శాఖ చీఫ్ సెక్రటరీ, కమిషనర్ ఎస్‌డిసి రామచంద్ర మోహన్, పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యర్, జీవిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ, వివిధ విభాగాల అధికారులు, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు దర్శించుకున్నారు.

సింహాద్రి అప్పన్న దర్శనానికి బారులుదీరిన భక్తులు

ప్రశాంత ఎన్నికలకు పటిష్టమైన భద్రత

జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిష్పక్షపాతంగా జరిగేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల పరిశీలకులు, ఎస్పీ కేవీ మురళీకృష్ణలతో కలిసి పోలీసు అధికారులు, కేంద్ర బలగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గానికి డీఎస్పీ స్థాయి పోలీసు అధికారుల్ని నియమించినట్లు చెప్పారు. జిల్లాలో ఎక్కడా తీవ్రస్థాయి గొడవలు తలెత్తే అవకాశం లేదని, అయినా పోలీసు అధికారులు భద్రతా దళాలు అత్యంత జాగరూకతతో విధి నిర్వహణ చేయాలని సూచించారు. పోలింగ్ సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తీసుకు వెళ్లేటప్పుడు వాహనాన్ని మధ్యలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపరాదన్నారు. 11వ తేదీ సాయంత్రం 6 గంటల నుండి ఎటువంటి సభలు సమావేశాలు ర్యాలీలు జరగకుండా చూడాలని, పోస్టర్లు కటౌట్లు ఏర్పాటు చేయరాదని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఇంటిలిజెంట్ రిపోర్టు ద్వారా ప్రణాళికాయుతంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ "నో వైలెన్స్-నో రీపోల్" అనే భావంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల పరిస్థితిని పరిశీలించి అంచనాలు రూపొందించామని, సమస్యాత్మక కేంద్రాలకు తగిన బందోబస్తు ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఎన్నికల పరిశీలకులు మాట్లాడుతూ ఆఖరు రెండు రోజులలో వివిధ స్థాయిలలో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే అవకాశాలు ఉన్నందున సూక్ష్మస్థాయిలో తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో సాధారణ పరిశీలకులు దల్జీత్‌సింగ్ మంగత్, రాకేష్ కుమార్, మోహన్ దహికర్, రామస్వామి, ఏఎస్‌పి బి.విజయభాస్కర్ ఆరు నియోజక వర్గాల డిఎస్పీలు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు డి రామ్మూర్తి పాల్గొన్నారు.

ఏడుగురు గ్రామ వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని ఆర్లి గ్రామ సచివాలయం పరిధిలో పని చేస్తున్న ఏడుగురు గ్రామ వాలంటీర్లు శుక్రవారం రాజీనామా చేసినట్లు ఎంపీడీవో అప్పలరాజు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో 143 మంది వాలంటీర్లు వ్యక్తిగత కారణాల వల్ల విధుల నుంచి తప్పుకున్నట్లు చెప్పారు.

రాజ్యాంగ హక్కుల పరిరక్షకులకు ఓటేయాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు : రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించే వారికి ఓటు వేయాలని సిపిఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాల నాయుడు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ బిజెపి నరేంద్ర మోడీ ఈ ఎన్నికల్లో 400 ఎంపీ సీట్లు గెలిచి భారత రాజ్యాంగాన్ని మార్చుతామని, లౌకికవాదాన్ని, రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెబుతున్నారని తెలిపారు. భావ ప్రకటన స్వేచ్ఛగా పూర్తిగా భంగం కలిగించే విధంగా మోడీ ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. ఇవన్నీ రాజ్యాంగ స్ఫూర్తిగా పూర్తి విర్ధుమన్నారు. మరో వైపు నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎపికి తీవ్ర ద్రోహం చేసిందని, విభజన హామీలను అమలు చేయలేదని తెలిపారు. అయినా బిజెపి ప్రభుత్వ విధానాలను రాష్ట్రంలో వైసిపి ఆఘమేఘాల మీద అమలు చేసిందన్నారు. అందువల్ల బిజెపి, దానికి మద్దతు ఇస్తున్న టిడిపి, జనసేన, తొత్తుగా వ్యవహరిస్తున్న వైసిపి అభ్యర్థులను ఓడించి, మోడీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్, జగన్మోహన్‌రెడ్డికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. వీటికి భిన్నంగా ఇండియా వేదిక పార్టీలు స్పష్టమైన హామీతో ఎన్నికల బరిలోకి దిగాయని, ఇండియా వేదిక తరుపున పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు, కెవిపిఎస్ నాయకులు గాడి ప్రసాదు, రైతు సంఘం నాయకులు వనుము సూర్యనారాయణ పాల్గొన్నారు.

కొనసాగిన మత్స్యకారుల ఆందోళన

ప్రజాశక్తి-అచ్యుతాపురం : పూడిమడకలో ఫిషింగ్ హార్బర్ జెట్టీ నిర్మాణానికి సర్వే నెంబర్, 12, 134 రెండు నెంబర్లలో 7 ఎకరాల విస్తీర్ణంలో భూములు అక్రమంగా స్వాధీనపరుచుకున్నారని, తమకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గత కొన్ని రోజులుగా పూడిమడక తీరంలో మత్స్యకారులు చేస్తున్న ఆందోళన శుక్రవారం కూడా కొనసాగింది. శుక్రవారం బాధితులు చేపల తాతయ్య, పేర్ల మంగ, పేర్ల బాపునమ్మ, అంగ కామేశ్వరి, చల్లా లక్ష్మి తదితరులు చేపట్టిన ఆందోళనకు పలువురు సంఘీభావం తెలిపారు. మత్స్యకారుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించి వారికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

స్వతంత్ర అభ్యర్థి 'గుంటూరు' ప్రచారం

ప్రజాశక్తి- సబ్బవరం : పెందుర్తి నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థి గుంటూరు వెంకట నరసింహారావు శుక్రవారం మండలంలోని వంగలి, పెదనాయుడు పాలెం గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి బ్యాలెట్ నమూనా పత్రాలను పంపిణీ చేసి ఉంగరం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు భారతి, ముఖేష్, సాయి ప్రియ, పూజిత తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు యువకులు మృతి

రొయ్యల చెరువు గట్టుకు అమర్చిన వైర్లకు తగలడంతో దుర్ఘటన

ప్రజాశక్తి-అచ్యుతాపురం : పూడిమడక గ్రామంలో గురువారం రాత్రి రొయ్యల చెరువు గట్టుపై అమర్చిన విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై ఇద్దరు మత్స్యకార యువకులు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం... పూడిమడకకు సమీపంలో ఉన్న రొయ్యల చెరువు చుట్టూ అపరిచితులు ప్రవేశించకుండా, చెరువు గట్టుపై విద్యుత్ దీపాలు వెలగటానికి అనుకూలంగా విద్యుత్ తీగలను యజమాని అమర్చాడు. గురువారం రాత్రి పూడిమడక పంచాయతీ కడపాలెం గ్రామానికి చెందిన ఎజ్జల సోము నాయుడు (25) చోడిపల్లి రాజు (27) తదితర మత్స్యకార యువకులు చెరువు వద్దకు వెళ్లారు. చెరువు గట్టుపై అమర్చిన విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు ఇద్దరు యువకులకు తగలడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో వారి కుటుంబాలు కన్నీరుమున్నీరయ్యాయి. ఎజ్జల సోమునాయుడుకు ఇంకా పెళ్లి కాలేదు. తల్లిదండ్రులు రాజయ్య లక్ష్మి తమను చూసేవారు ఎవరని బోరున విలపించారు. చౌడిపల్లి రాజుకు భార్య ముత్యాలమ్మ, పాప బాబు ఉన్నారు. జీవితాంతం పోషిస్తాడని నమ్ముకున్న వ్యక్తి దూరం కావడంతో తమ జీవన పరిస్థితి ఏమిటని లబోదిబోమని రోదిస్తున్నారు. ఇద్దరు యువకులు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. అచ్యుతాపురం సిఐ ఎం బుచ్చిరాజు సంఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.32 లక్షలు పరిహారం ఇవ్వడానికి ఒప్పందం

మృతుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు చెరువు యజమానిని డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామస్తులకు రొయ్యల చెరువు యజమానికి మధ్య శుక్రవారం జరిగిన చర్చల్లో మృతుల కుటుంబాలకు రూ.32 లక్షలు ఇవ్వడానికి ఒప్పందం కుదిరింది.